# పాఠశాల విద్య, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు.

## కమీషనర్ మరియు సంచాలకుల ఉత్తర్వులు

ఉత్తర్వు సంఖ్య: **401/71/Planning-1/2014** తేది: 1.09.2014

విషయం : తెలంగాణ రాష్ట్రం, పాఠశాల విద్య – ఆర్.టి.ఇ, 2009 – అన్ని పాఠశాలల్లో నిరంతర సమగ్ర మూల్యాంకనం (సి.సి.ఇ), 9, 10వ తరగతులకు పరీక్షల సంస్కరణలను అమలు చేయడం గురించి.

సందర్భం : 1. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 60, పాఠశాల విద్య (ప్రా.వి.–ఎస్.ఎస్.ఎ) విభాగం, తేది. 24.10.2013

2. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 17, పాఠశాల విద్య (ప్రా.వి.–కార్యక్రమం II) విభాగం, తేది. 14.05.2014

3. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 2, పాఠశాల విద్య (కార్యక్రమం II) విభాగం, తేది. 26.08.2014

× × ×

పై విషయం పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రంలోని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మరియు జిల్లా విద్యాధికారులందరికి తెలియజేయునది ఏమనగా, పై సందర్భం అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో నిరంతర సమగ్ర మూల్యాంకనం (సి.సి.ఇ), 9, 10వ తరగతులకు పరీక్షల సంస్కరణలను అమలు చేయడం గురించి ఉత్తర్వులను జారీ చేశారు.

పై సందర్భంలోని మొదటి ఉత్వర్వుల ప్రకారం మన రాష్ట్రంలో 1 నుండి 8వ తరగతి వరకు అన్ని పాఠశాలల్లో నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని ఆర్.టి.ఇ–2009 ప్రకారం విధిగా అమలుజరపాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని (ఫార్మేటివ్), సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని (సమ్మేటివ్) నిర్వహించాలి. జూలై, ఆగస్టు, నవంబర్, ఫిబ్రవరి మాసాల్లో పిల్లల ప్రగతిని నిర్మాణాత్మక మూల్యాంకనం ద్వారా అంచనా వేసి సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలి. అల్లే, సెప్టెంబర్/ అక్టోబర్ మాసంలో మొదటి సంగ్రహణాత్మక, డిసెంబర్/ జనవరిలో రెండవ సంగ్రహణాత్మక, మార్చి/ ఏప్రిల్ మాసంలో మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని నిర్వహించి పిల్లల ప్రగతిని నమోదు చేయాలి. ఇందుకోసం గత సంవత్సరం రాజీవ్ విద్యా మిషన్ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పిల్లల ప్రగతిని నమోదు చేసి తల్లిదండ్రులకు పంపడానికి క్యుములేటివ్ రికార్డులను అందజేశారు. అల్లే, ఉపాధ్యాయులందరికి ఇప్పటికే రెండుసార్లు వీటి గురించి ముఖాముఖి శిక్షణతోపాటు టెలికాన్ఫరెన్స్ ద్వారా కూడా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులు పాఠ్యప్రణాళికలను అనగా వార్షిక, పాఠాలకు ప్రణాళికలను రూపొందించి బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. అయితే, ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఏ పాఠశాలలో కూడా అమలుజరగడం లేదు. ఈ ఉత్తర్వులను పూర్తిస్థాయిలో అన్ని పాఠశాలల్లో అమలుచేయాలి.

పై సందర్భంలోని రెండు, మూడు ఉత్వర్వుల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 9, 10 తరగతులకు అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పరీక్షల సంస్కరణలను అమలుపరచడానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అల్లే స్వల్ప సవరణలను కూడా చేర్చింది. ఈ ఉత్వర్వుల ప్రకారం అన్ని పాఠశాలల్లో (ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్, రెసిడెన్షియల్, ప్రైవేట్ ఎయిడెడ్, గుర్తింపు పొందిన పాఠశాలలు) అమలుపరచాల్సి ఉంటుంది. వీటికి కూడా నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలను నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ఆగస్టు మాసం వరకు రెండు నిర్మాణాత్మక మూల్యాంకనాలను నిర్వహించాల్సి ఉండగా ఏ పాఠశాలలో కూడా వీటిని సక్రమంగా నిర్వహించలేదు. కాబట్టి, అన్ని పాఠశాలల్లో కింది చర్యలు చేపట్టాలి.

- ఈ విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లుగా పరీక్షా సంస్కరణలు వెంటనే అమలులోకి రావాలి. అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలి.
- నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలను నిర్ధారించిన మాసాల్లో నిర్వహించాలి.

- ఇప్పటి నుండి ఏ పాఠశాలలో కూడా యూనిట్ టెస్ట్‌లు నిర్వహించకూడదు. వాటి స్థానంలో నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని నిర్వహించాలి.
- భాషా సబ్జక్టులలో పిల్లలు గ్రంథాలయ పుస్తకాలు/ వార్తాపత్రికలు చదివి సమీక్షా నివేదికలు రాయాల్సి ఉంటుంది. ఇందుకనుగుణంగా అన్ని పాఠశాలల్లో పఠన సామగ్రిని సమకూర్చుకోవాలి. ప్రధానంగా ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో సంబంధిత యాజమాన్యాలు వీటిని సమకూర్చాలి.
- సైన్స్ సబ్జక్టుల్లో ప్రయోగాలు చేసి రికార్డు రాయాల్సి ఉంటుంది. ఇందుకనుగుణంగా ప్రయోగ సామగ్రిని, పరికరాలను సమకూర్చుకోవాలి.
- సాంఘిక శాస్త్రంలో అట్లాస్‌లు, గ్లోబులు, మ్యాప్‌లు, విషయ సంబంధిత పఠన గ్రంథాలు, వార్తాంశాలు పాఠశాలల్లో పిల్లలకు అందుబాటులో ఉంచాలి. వీటి ఆధారంగా పిల్లలు సమకాలీన అంశాలపై స్పందించి నివేదికలు రాస్తారు.
- ఎట్టి పరిస్థితుల్లో పిల్లలు పాఠ్యపుస్తకాల్లోని ప్రశ్నలకు జవాబులను గైళ్ళు, స్టడీ మెటీరియళ్ళు చూసి రాయకూడదు. గైళ్ళను, స్టడీ మెటీరియళ్ళను ఎవరూ కూడా వినియోగించకూడదు. ప్రశ్నలకు జవాబులను పాఠశాలలోనే ఉపాధ్యాయుడి సమక్షంలో చర్చించి రాయాల్సి ఉంటుంది. వీటిని ఉపాధ్యాయులు సరిచేసి సలహాలు, సూచనలు ఇవ్వాలి.
- నిర్మాణాత్మక మూల్యాంకనంలోని నాలుగు అంశాలకు సంబంధించిన వివరాలను/ నివేదికలను, లఘుపరీక్ష సమాధానాలు రాయడానికి, ప్రాజెక్టుపని నివేదికలు రాయడానికి ఒకే నోటుపుస్తకాన్ని వినియోగించాలి.
- ఒక నిర్మాణాత్మక మూల్యాంకనం సమయంలో వీటికి సంబంధించిన నాలుగు అంశాలలో ఒక్కొక్క దానికి ఒక అంశానికి నివేదిక రాస్తే సరిపోతుంది. ఉదాహరణకు ఒక నిర్మాణాత్మక మూల్యాంకనానికి ఒక ప్రాజెక్టుపని నివేదిక రాస్తే సరిపోతుంది.
- ప్రాజెక్టుపనులు పాఠ్యపుస్తకాల్లో ఇచ్చినప్పటికీ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు అవసరమైన మార్పులుచేర్పులు చేసుకోవచ్చు.
- నిర్మాణాత్మక మూల్యాంకనం వివరాలను, సంగ్రహణాత్మక మూల్యాంకన వివరాలను సబ్జక్టువారీ ఉపాధ్యాయులు ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలి. దీని ఆధారంగా 1 నుండి 8 తరగతులకు క్యుములేటివ్ రికార్డులో మరియు 9, 10 తరగతులకు ప్రగతిపత్రాల్లో నమోదు చేయాలి. తల్లిదండ్రులకు పంపాలి. వీటి నమూనాలను ఎస్.సి.ఇ.ఆర్.టి. రూపొందించింది. ఎస్.సి.ఇ.ఆర్.టి వెబ్‌సైట్ www.scert.telangana.gov.in నుండి పొందవచ్చు.
- సబ్జక్టులతోపాటు సహపాఠ్య కార్యక్రమాలు అనగా, విలువల విద్య-జీవన నైపుణ్యాలు; పని-కంప్యూటర్ విద్య; వ్యాయామ-ఆరోగ్య విద్య; కళలు-సాంస్కృతిక విద్యలకు కూడా బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించి మూల్యాంకనం చేయాలి. వీటికి సంబంధించిన సిలబస్ పుస్తకాలను, ఉపాధ్యాయ కరదీపికలను ఎస్.సి.ఇ.ఆర్.టి వెబ్‌సైట్‌లో ఉంచారు. అట్లే వీటిని ముద్రించి పాఠశాలలకు త్వరలో అందిస్తారు.
- అన్ని జిల్లాల్లో డి.సి.ఇ.బి. ఆధ్వర్యంలో ఒక్కొక్క సబ్జక్టుకు పాఠ్యపుస్తక రచయితలతోపాటు నిష్ణాతులైన 15 మంది సభ్యులతో సబ్జక్టు బృందాలను ఏర్పరచుకోవాలి. వీరిలో జిల్లాలోని ఒక్కొక్క డివిజన్ నుండి ప్రతి సబ్జక్టులో కనీసం ఇద్దరు ముగ్గురు సభ్యులు ఉండేలా చూడాలి. వీరి సేవలను జిల్లాలో ప్రశ్నాపత్రాల రూపకల్పనకు, శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు, మానిటరింగ్‌కు ఉపయోగించుకోవాలి. వీరికి రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇస్తారు. అయితే, వీరి పనితీరు సరిగా లేకున్నా, వారి పాఠశాలల్లో వీటిని అమలుపరచకున్నా వీరి స్థానంలో ఇతరులను ఎంపిక చేయాలి.
- ఈ పరీక్షా సంస్కరణలను అన్ని పాఠశాలల్లో అమలు జరిగేలా చేయడానికి సంబంధిత ఉపాధ్యాయులందరికి అవసరమైన శిక్షణ అవసరాలను గుర్తించడం, వారికి శిక్షణ నిర్వహించే బాధ్యత పూర్తిగా జిల్లాలోని ఉప విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులపైన ఉంటుంది. కాబట్టి, వీరు బాధ్యత వహించి అందరూ శిక్షణ పొందేలా పరీక్షల సంస్కరణలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలి. ఇందుకోసం ఎస్.సి.ఇ.ఆర్.టి. తో ఎప్పటికప్పుడు సంప్రదించి అవసరమైన శిక్షణలను నిర్వహించాలి.
- పరీక్షల సంస్కరణలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన అకడమిక్ క్యాలెండర్‌లోని అంశాలను పాఠశాలలో అమలు జరిపేలా చూడాలి. అకడమిక్ క్యాలెండర్ ఎస్.సి.ఇ.ఆర్.టి. వెబ్‌సైట్‌లో ఉన్నది.

- పరీక్షల సంస్కరణలను, సి.సి.ఇ. ని ఆయా పాఠశాలల్లో అమలుపరిచే బాధ్యత పూర్తిగా ప్రధానోపాధ్యాయులపైన ఉంటుంది. ఇందుకనుగుణంగా ఉపాధ్యాయులు వార్షిక, పాఠ్యప్రణాళికలను రూపొందించి బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించేలా చూడాలి.
- పర్యవేక్షణ అధికారులు అనగా మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు వారి పరిధిలోని అన్ని యాజమాన్యాలకు సంబంధించిన పాఠశాలలను పరిశీలించి నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలి. పిల్లలకు కేటాయించిన మార్కులను సంబంధిత రికార్డులతో, ఆధారాలతో పోల్చి పరిశీలించాలి. అవసరమైన సలహాలు, సూచనలను ఆయా పాఠశాలల్లోని అకడమిక్ గైడెన్స్ రిజిష్టర్‌లో నమోదు చేయాలి. వాటిని పాటించేలా ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేయాలి.

ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే రెండు నిర్మాణాత్మక మూల్యాంకనాలు నిర్వహించాల్సి ఉండగా ఇవి సక్రమంగా నిర్వహించబడలేదు. కాబట్టి, అన్ని పాఠశాలల్లో 1 నుండి 10వ తరగతి వరకు రెండు నిర్మాణాత్మక మూల్యాంకనాలను సక్రమంగా సెప్టెంబర్ మాసంలోగా నిర్వహించాలి. ప్రగతిని నమోదు చేయాలి. ఇందుకోసం ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించే మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకన పరీక్షలను అక్టోబర్ 13కు వాయిదా వేశారు. అక్టోబర్ 13 నుండి 9, 10 తరగతులకు ప్రభుత్వ ఉత్తర్వులు 17, 2 లలో సూచించిన విధంగా ఒక్కొక్క సబ్జక్టుకు రెండేసి పేపర్ల చొప్పున (హిందీ కాకుండా) నిర్వహించాలి. ఉదయం 09.30 నుండి 12.15 వరకు మొదటి పేపర్‌ను మరియు 2.00 గంటల నుండి 04.45 వరకు రెండవ పేపర్‌ను నిర్వహించాలి. 6 నుండి 8వ తరగతి వరకు రోజుకొక సబ్జక్టు చొప్పున ఉదయం 09.30 నుండి 12.00 వరకు నిర్వహించాలి. అట్లే ప్రాథమిక తరగతులకు కూడా అక్టోబర్ 13 నుండే రోజుకొక సబ్జక్టు చొప్పున నిర్వహించాలి.

కాబట్టి, ప్రాంతీయ సంచాలకులు, జిల్లా విద్యాధికారులు అందరూ సందర్భంలో చూపిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సి.సి.ఇ., పరీక్షల సంస్కరణలు పూర్తి స్థాయిలో జిల్లాలోని అన్ని యాజమాన్యాలు (ప్రభుత్వ, ప్రైవేట్, గుర్తింపు పొందిన, మున్సిపల్, సంక్షేమశాఖ, పంచాయతీరాజ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో వెంటనే అమలు చేయాలి. కావున, ఈ ఉత్తర్వుల ప్రతులను ఇందువెంట జతచేయనైనది. వీటిని యథాతథంగా వెంటనే అమలుపరచేలా చూడాలని కోరనైనది. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన పాఠశాలలు/ యాజమాన్యాలపై, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటారు.

గమనిక: అనుబంధంలో ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 60, 17, 2లను జతచేయనైనది.

కమీషనర్ మరియు సంచాలకులు
పాఠశాల విద్య
తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాదు.

<u>దీని ప్రతులు</u>
ప్రాంతీయ సంయుక్త సంచాలకులు,
జిల్లా విద్యాధికారులందరికి తగు చర్యల నిమిత్తం.